క్లుప్తంగా

ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న నారాయణరెడ్డి

మహాముత్తారం: మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన జరుపుల విజేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైయ్యాడు. దీంతో విజేందర్‌ను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, కాటారం సింగిల్‌విండో చైర్మన్ చల్ల నారాయణరెడ్డి శుక్రవారం పరామర్శించి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెల్సుకున్నారు. అనంతరం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ములుగు రూరల్: ములుగు పట్టణ పరిధిలో విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ సాయికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని అన్నారు.

18న మహాశివరాత్రి జాగరణ మహోత్సవం



పరకాల : శ్రీకుంకుమేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 18న మహా శివరాత్రి జాగరణ మహారుద్రయాగ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు తెలిపారు. హన్మకొండలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చేతుల మీదుగా శివరాత్రి మహోత్సవ కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. శివనామ సంకీర్తనలతో అత్యంత వైభవంగా జరుగనున్న శివరాత్రి ఉత్సవాలకు భక్తులు హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. కార్యక్రమంలో పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ బండి సారంగపాణి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలను నియమించాలి

వెంకటాపురం(కె): ఏజెన్సీ ప్రాంతంలోని ఆశ్రమ పాఠశాలలో ఏఎన్‌ఎంలను నియమించాలని ఆదివాసీ సీనియర్ నాయకుడు పూనెం సాయి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు, జ్వరాలు, వ్యాధులబారిన పడుతున్న అధికారులు పట్టించుకోవటం లేదని అన్నారు. ఆశ్రమ పాఠశాలలో ఏఎన్‌ఎంలను నియమిస్తే విద్యార్థులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలను అందిస్తారని అన్నారు. ఈ సమావేశంలో సమ్మయ్య, వంశీ ఉన్నారు.

ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలి

నర్సంపేట రూరల్ : ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన పథకం కింద రైతులకు అకౌంట్‌లలోకి డబ్బులు జమ కావాలంటే అకౌంట్ నంబర్‌కు ఆధార్‌ను తప్పనిసరిగా లింక్ చేసుకోవాలని నర్సంపేట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు అవినాష్ వర్మ అన్నారు. పట్టణంలోని యూనియన్ బ్యాంక్ మేనేజర్‌తో కలిసి వివరించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ బ్యాంక్ అకౌంట్ ఖాతాకు ఆధార్ నంబర్ లింకు లేనిఖాతాలకు పీఎం కిసాన్ డబ్బులు రావడం లేదన్నారు. ఎ వరైనా రైతులు పీఎం కిసాన్ లబ్ధిని పొందుతున్నారో, వారు తక్షణమే బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



శాయంపేట : యోగా సాధన ద్వారానే మనిషికి సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ప్రముఖ యోగా ట్రైనర్ కృష్ణ నాయక తెలిపారు. యోగాపై పాఠశాల స్థాయి విద్యార్థులకు అవగాహన కల్పించే లక్ష్యంతో మైసూర్‌లో ప్రారంభించిన కృష్ణనాయక పాదయాత్ర నాలుగు నెలలుగా కొనసాగుతూ మండలంలోని మందారిపేట స్టేజీ వద్దకు శుక్రవారం చేరుకుంది. కృష్ణనాయకకు కాంగ్రెస్ యూత్ నాయకులు సాదు నాగరాజు, అనిల్ సాదారంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కృష్ణనాయక మాట్లాడారు. పాఠశాలల విద్యార్థులకు యోగా ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. యోగా సాధన చేయడం ద్వారా అన్ని రకాల వ్యాధుల నుంచి శరీరాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. ప్రతిరోజూ యోగా చేస్తే ఆరోగ్యవంతమైన జీవితం గడవచ్చని తెలిపారు. 28 రాష్ట్రాల్లో రెండేళ్లపాటు పాదయాత్ర కొనసాగుతుందని వివరించారు. యోగాపై అవగాహన కల్పించడమే తన ధ్యేయమని స్పష్టం చేశారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



టేకుమట్ల: శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ నల్లబెల్లి రమ

టేకుమట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగును కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆశాజ్యోతి అన్నారు. శుక్రవారం మండలంలోని గర్మిళ్లపల్లిలో సర్పంచ్ నల్లబెల్లి రమారవీందర్ ఆధ్వర్యంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ కంటి చూపు సరిగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. గ్రామంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరంలో ప్రతి ఒక్కరూ పరీక్షలు చేపించుకోవాలన్నారు. శిబిరానికి మొత్తం 170 మంది రాగా 15 మందికి కంటి అద్దాలను అందించి, ఆపరేషన్ కోసం 25 మంది, 15 మందికి అద్దాలను ఆర్డర్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఏనుగు తిరుమలలచ్చిరెడ్డి, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఏటూరునాగారం: మండలంలోని చిన్నబోయినపల్లిలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అభినందన్‌రెడ్డి మాట్లాడుతూ.. శిబిరంలో 151 మందికి కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. అంధత్వ సమస్య ఉన్న వారు ఆధార్ కార్డులను వెంట తీసుకొని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న శిబిరానికి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి ఉషారాణి, క్యాంప్ కోఆర్డినేటర్ రమణకుమారి, ఆఫ్తాల్మిక్ అసిస్టెంట్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సామగ్రి అందజేత



టీవీని ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని నందిగామ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు నేషనల్ ఆగ్రోఫౌండేషన్ ఆధ్వర్యంలో 65 ఇంచుల ఎల్‌జీ ఎల్‌ఈడీ టీవీతో పాటు, రూ.4లక్షలు విలువ చేసే డిజిటల్ క్లాస్‌లకోసం క్లాస్‌రూముల్లో ప్రొజెక్టర్, వైఫై, అత్యాధునిక బ్లాక్ బోర్డులు అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నేషనల్ ఆగ్రో సంస్థ నందిగ్రామ కమిటీ చైర్మన్ లింగమల్ల బోసు మాట్లాడుతూ.. భూపాలపల్లి హెచ్‌ఎఫ్‌డీసీ బ్యాంకు సహకారంతో నందిగామ గ్రామానికి ఆగ్రోఫౌండేషన్ సంస్థ పూర్తి సహకారాలు అందిస్తుందన్నారు. ఇప్పటికే గ్రామంలో ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందని, అదేవిధంగా గ్రామంలోని రైతులకు వివిధ రకాల పండ్ల మొక్కలు పంపిణీ చేశామన్నారు. రానున్న రోజుల్లో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, సర్పంచ్ స్వామి ఆగ్రోఫౌండేషన్ వారికి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఆగ్రోఫౌండేషన్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ రంగస్వామి, సంస్థ ప్రతినిధులు రవితేజ, శ్రీకాంత్, కిరణ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలపండి



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్

కాటారం: మండల కేంద్రం శివారులోని సర్వే నంబర్ 418లో ఇటీవల నిర్వహించిన సర్వేకు సంబంధించి ఏమైన అభ్యంతరాలు ఉంటే తెలపాలని తహసీల్దార్ జివాకర్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. సర్వే నంబర్ 418లో అధికారులు చేసిన సర్వే వివరాలు, మోఖపై ఉన్న వారి వివరాలను చదివి వినిపించారు. వారంలోగా ఏమైన అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీటీసీ జాడి మహేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్ ప్రారంభం



అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీపీ సుజాత

మొగుళ్లపల్లి: మండలంలోని పిడిసిల్ల గ్రామంలో నీతి ఆయోగ్ నిధులతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎంపీపీ యార సుజాత శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. పిల్లలకు, గర్భిణులకు పాలు, గుడ్లు సకాలంలో అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జోరుక సదయ్య, ఎంపీడీఓ కృష్ణవేణి, స్థానిక సర్పంచ్ నైనకంటి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ దండ వెంకటేశ్వరరెడ్డి, వార్డుసభ్యులు కట్కూరి అయిలయ్య, బొడ్డిరెడ్డి జయపాల్‌రెడ్డి, మాదం సురేష్, లకుం సరోజన, లావణ్య, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సన్మానం



కృష్ణప్రసాద్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మంగపేట: మండలంలోని చుంచుపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో టీఎస్ టీడబ్ల్యూటీయూ రాష్ట్ర అధ్యక్షుడు పొదెం కృష్ణప్రసాద్‌ను ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నల్లెబోయిన కోటయ్య, జబ్బ రవి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలవాసిగా టీడబ్ల్యూటీయూ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చేల శాంతకుమారి, ఉపాధ్యాయులు ఇర్ప వేణు, పోలెబోయిన నర్సింగరావు, బంధం రూప, మడి సంధ్య, బంగారి విజయ, సునీత, లలిత, పాఠశాల విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ విగ్రహానికి జలాధివాసం



జలాధివాసానికి నీటి బిందెలతో వెళ్తున్న మహిళలు, గ్రామస్తులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఓడవాడ సమీపంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా శుక్రవారం జలాధివాసం, మహానివేదన నీరాజన కార్యక్రమాన్ని అర్చకులు ఉదయచార్యులు ఆధ్వర్యంలో చేపట్టారు. మంగళతోరణం, దేవతల ఆహ్వానం, గోపూజ యాగశాల ప్రవేశం, ఆఖండ దీపారాధన, అగ్ని ప్రతిష్ఠాపన లక్ష్మీ గణపతి హోమాలను నిర్వహించారు. జలాధివాసానికి పవిత్రమైన గోదావరి నదిలోని నీటిని మహిళలు పెద్ద ఎత్తున తీసుకువచ్చారు. దీంతో ప్రతిష్ఠాపన పూజలు, హోమాలు మొదలయ్యాయి. భక్తులు హోమంలో పాల్గొని పూజలు నిర్వహించారు.

పౌష్టికాహారం అందించాలి



అంగన్‌వాడీ పిల్లలతో మాట్లాడుతున్న శారద

నల్లబెల్లి : అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు సరైన పౌష్టికాహారాన్ని అందించాలని డీడబ్ల్యూఓ శారద అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. కలెక్టర్ గోపీ ఆదేశాల మేరకు స్థానిక ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రాథమిక పాఠశాల భవనంలోకి మారుస్తామని తెలిపారు. దీంతో గర్భిణీలు, బాలింతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. పిల్లలను అంతదూరం పంపించలేమని చెప్పారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకవెళ్లి తగుచర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అంగన్‌వాడీ పిల్లలు, గర్భిణీలతో చర్చిస్తూ అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ ఐసీడీఎస్ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ఆదర్శంగా ఉండాలని సూచించారు. ప్రీస్కూల్ టైం టేబుల్ పారదర్శంగా అమలు చేయాలన్నారు. తల్లులు అంగన్‌వాడీ కేంద్రాలో భోజనం చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట ఏసీడీపీఓలు విద్య, ప్రేమలత, సూపర్ వైజర్స్ జాన్సీరాణి, శామలాదేవి పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీల సేవలు మరువలేనివి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి

శాయంపేట : గ్రామ స్థాయిలో ప్రజలకు ఆర్‌ఎంపీలు, పీఎంపీలు అందిస్తున్న వైద్యసేవలు మరువలేనివని వరంగల్ రూరల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్‌వీకేకే ఫంక్షన్ హాల్‌లో ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. పల్లెల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా సత్వరమే ప్రాథమిక వైద్యం అందిస్తున్న ఘనత ఆర్‌ఎంపీ, పీఎంపీలకే దక్కుతుందన్నారు. ఆర్‌ఎంపీలు, పీఎంపీలు స్థాయికి మించి వైద్యం చేయవద్దని సూచించారు. ప్రభుత్వం తగిన గుర్తింపు ఇచ్చేలా చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టేకుమట్ల జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ సాయికృష్ణ, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు అబ్బు ప్రకాశ్‌రెడ్డి, గాజె రాజేందర్, సంఘం మండల అధ్యక్షుడు కానుగుల నాగరాజు, ప్రధాన కార్యదర్శి అబ్బు జయపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కందగట్ల అనిల్, కోశాధికారి చెక్క భిక్షపతి, సహాయ కార్యదర్శి బత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

'రానున్న ఎన్నికల్లో గెలుపు ఖాయం'

ఆత్మకూరు : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింత సాంబమూర్తి తెలిపారు. మండల కేంద్రంలోని పోచమ్మ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనతో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తున్నారని చెప్పారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని సూచించారు. సమావేశంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ విజయచందర్‌రెడ్డి, కార్నర్ మీటింగ్స్ కన్వీనర్ గురిజాల శ్రీరాంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇర్సడ్ల సదానందం, ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, ఆర్‌టీఐ కన్వీనర్ ఎదులాపురం శ్రావణ్‌కుమార్, ఓబీసీ సెల్ కన్వీనర్ సదానందం, బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, కిసాన్ సెల్ కన్వీనర్ వంగాల బుచ్చిరెడ్డి, బయ్య పైడి ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు పెంచాలి

నర్సంపేట : ఇటుక బట్టి కార్మికుల వేతనాలు పెంచాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించి లేబర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వెయ్యి ఇటుకల తయారీకి రూ.1500 ఇవ్వాలన్నారు. లైట్ వెయిట్ ఇటుకలకు వెయ్యికి రూ.వెయ్యి అందించాలని, ప్రతీ కార్మికుడి కుటుంబానికి ఒక సిలిండర్ గ్యాస్ ఇవ్వాలని కో రారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోతే ఈనెల 21 నుంచి సమ్మె నిర్వహించడం జరుగుతుందని హెచ్చరించారు.

వాహనాల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న ఎస్సై తిరుపతి

వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం వద్ద జాతీయ రహదారిపై వాజేడు ఎస్సై కొప్పుల తిరుపతిరావు శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎక్కువ మంది ప్రయాణికులతో వస్తున్న వాహనలను ఆపి జరిమానాలను విధించారు. ఆదేవిధంగా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లిన, అతివేగంగా నడిపిన వాహనదారులపై చట్టపరంగా కఠిన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు



మొక్కలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి సంజీవ్‌రావు

కాటారం: హరితహారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపుల నాటిన మొక్కల పెంపకంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేకాధికారి సంజీవ్‌రావు పంచాయతీ అధికారును హెచ్చరించారు. కాటారం మండలంలోని మేడిపల్లి నుంచి నస్తూర్‌పల్లి జాతీయ రహదారిపై రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. మేడిపల్లిలో సుమారు 30 శాతం మొక్కలు నీరు లేక చనిపోవడం, ట్రీగార్డులు లేకపోవడం, మొక్కల చుట్టూ కలుపు పెరగడంపై పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన రహదారుల వెంట పలుచోట్ల నాటిన మొక్కలు చనిపోవడంతో ఆ స్థానంలో వెంటనే కొత్త మొక్కలు నాటాలని ఆదేశించారు. మొక్కలపై శ్రద్ధ వహించి ఏపుగా పెరిగేలా చూడాలన్నారు. ప్రత్యేకాధికారి వెంట ఏపీఓ వెంకన్న, టెక్నికల్ అసిస్టెంట్ రవళి, పంచాయితీ కార్యదర్శులు రాకేశ్, జ్యోత్స్న, రజిత, షగీర్‌ఖాన్, సురేశ్ ఉన్నారు.

జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న సత్యనారాయణ

మల్హర్: మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ, రైతువేదిక కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు సర్పంచ్ సుంకరి సత్యనారయణ శుక్రవారం భూమిపూజ చేశారు. రూ.20 లక్షల ఎంఎస్‌ఆర్ ఈజీసీ నిధులతో నిర్మించునున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు మండల అధ్యక్షుడు గోనె శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ మల్క ప్రకాష్‌రావు, డైరెక్టర్ మల్క రాజేశ్వర్‌రావు, వార్డు సభ్యుడు బండి స్వామి, బూడిది మల్లేష్, అక్కపాక సమ్మయ్య, గుమ్మడి రవి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకు పాటుపడాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

టేకుమట్ల(రేగొండ): అవినీతి నిర్మూలనలో యువత పాత్ర కీలకమని రేగొండ తహసీల్దార్ షరీఫ్‌మొహినొద్దీన్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో యూత్ ఫర్ ఆంటీ కరప్షన్ 2023 సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, అందుకు యువత ముందుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ ఆంటీ కరప్షన్ మండల నాయకులు రాజు, ఆర్ఐ నరేష్, ధరణి ఆపరేటర్ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



జగదీశ్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ములుగు రూరల్: శానిటేషన్ వర్కర్ల 5 నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ తెలిపారు. ఈ మేరకు ములుగు ఏరియా ఆస్పత్రిలో డిస్టిక్ కో ఆర్డినేటర్ జగదీశ్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. వేతనాలు సకాలంలో అందక పోవడంతో శానిటేషన్ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎంసీహెచ్ విభాగంలో పని చేస్తున్న సుశీల అనే కాంట్రాక్ట్ ఉద్యోగికి 15 నెలలుగా కాంట్రాక్టర్ వేతనం చెల్లించడం లేదని అన్నారు. సిబ్బంది వేతనాలను సకాలంలో చెల్లించని పక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'నెమళ్లగుట్ట' జాతర



అమ్మవార్లను వన ప్రవేశానికి తీసుకెళ్తున్న పూజారులు

మంగపేట: మండలంలోని జబ్బోనిగూడెం శివారులోని నెమళ్లగుట్టలో నిర్వహించిన జాతర ముగిసింది. చివరి రోజు శుక్రవారం సమ్మక్క-సారలమ్మ, నాగులమ్మ అమ్మవార్లను వనప్రవేశం చేయించారు. మొక్కులు చెల్లింపు కార్యక్రమాన్ని పూజారి కుంట్ల నరేష్ ఆధ్వర్యంలో గిరిజన సాంస్కృతి, సాంప్రదాయబద్ధంగా మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించారు. చివరి రోజు సమ్మక్క-సారలమ్మ, నాగులమ్మ అమ్మవార్లను డోలీ వాయిద్యాలతో ఆలయ సమీపంలోని నెమళ్లగుట్టకు వన ప్రవేశం చేయించారు. ఈ కార్యక్రమంలో గిరిజన పూజారులు, కుల పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రావు

శాయంపేట : విద్యార్థులు కేవలం చదువులకే పరిమితం కాకుండా ఆటపాటల్లోనూ, ఇతర అన్ని రంగాల్లోనూ రాణించాలని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రావు సూచించారు. ఇటీవల ఆన్‌లైన్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ ప్రోగ్రాంలో పాల్గొన్న మండల కేంద్రంలోని ఆ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఆయన పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రావు మాట్లాడారు. ఒక్కో టీంకు నలుగురు చొప్పున ఐదు టీంల్లో 20 మంది విద్యార్థులు ఇన్నోవేషన్ చాలెంజ్ ప్రోగ్రాంలో పాల్గొని ప్రతిభ చాటారని తెలిపారు. ఈ క్రమంలోనే పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేసినట్టు వివరించారు. విద్యార్థులు ఎలాంటి ప్రతిభా పాటవ పరీక్షనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ ఎండీ.అబ్దుల్లా, సైన్స్ టీచర్ సత్య ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.